క్లుప్తంగా

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బుల్లిమోహన్‌రెడ్డి

అనపర్తి: సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని కొప్పవరం గ్రామ సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పవరం గ్రామ పరిధిలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ బుల్లిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందని సూచించారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీర్రాఘవరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎస్‌డీఏ డి.భవాని, ఐసీఆర్‌పీ మంగారత్నం, జగదీష్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ



రఘుదేవపురంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సీతానగరం: రఘుదేవపురంలో విరిగిన విద్యుత్తు స్తంభాన్ని తిరిగి ఏర్పాటు చేసి సరఫరాను ఆ శాఖ అధికారులు పునరుద్ధరించారు. పదిహేను రోజుల కిందట వర్షాలకు చెట్టు పడి విద్యుత్తు స్తంభం పడిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి మోటార్లు పని చేయకపోవడంతో సుమారు ఏభై ఎకరాలకు సాగునీటి సరఫరాకు ఆటంకం కలిగింది. స్తంభం ఏర్పాటు చేయాలంటే పొలంలో నీరు ఉందని విద్యుత్ శాఖాధికారులు కొన్ని రోజులు వేచి చూశారు. అదే లైన్‌పై ఉండే కొన్ని మోటార్లకు వేరే లైన్‌పై విద్యుత్‌ను అందించడంతో కొంత మేర పొలాలకు నీరు అందింది. సుమారు ముప్పై ఎకరాల్లో కూరగాయల పాదులు, పామాయిల్, మొక్కజొన్న పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ లేక పంటలకు నష్టం కలుగుతుందని రైతులు తెలపడంతో విద్యుత్తు శాఖ ఏడీఈ చిట్టిరాజు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయించారు.

బాలిక అదృశ్యంపై కేసు

సీతానగరం: రఘుదేవపురం గ్రామానికి చెందిన బాలిక (13) కనిపించడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 5 తెల్లవారుజామున తన కుమార్తె ఇంటి నుంచి వెళ్లిందని, ఇప్పటి వరకూ తిరిగి రాలేదని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారని అన్నారు.

కుక్కల దాడిలో మేకల మృతి



మృతి చెందిన మేక పిల్లలు

సీతానగరం: కూనవరం వద్ద పంట పొలంలో 27 మేకలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. శుక్రవారం ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తులు తమ మేకలను మేతకు తీసుకువెళ్లే సందర్భంలో పంట పొలంలో వదిలివెళ్లారు. ఈ సందర్భంలో కుక్కలు దాడి చేయడంతో పది మేక పిల్లలు చనిపోయాయి. వీటివిలువ రూ.3 లక్షలు ఉంటుందని పెంపకందారులు తెలిపారు.

గాయపరిచిన భర్తపై కేసు

బిక్కవోలు: భార్యను గాయపరిచిన భర్తపై కేసు నమోదు చేసినట్లు బిక్కవోలు ఎస్‌హెచ్‌ఓ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రంగాపురం గ్రామానికి చెందిన నక్కా లక్ష్మిని భర్త నాగరాజు కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. నాగరాజుకు వివాహేతర సంబంధం ఉండడంతో పెద్దల సమక్షంలో పెట్టినా వారి మాట వినలేదు. దీంతో ఈ నెల 4న ఆమె భర్తను నిలదీసింది. నాగరాజు ఆమెను కర్రతో కుడిచేయిపై కొట్టి గాయపరిచాడు. దీంతో లక్ష్మి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్‌హెచ్‌ఓ కృష్ణ తెలిపారు.

బాలిక కిడ్నాప్‌పై ఫిర్యాదు

మధురపూడి: బూరుగుపూడికి చెందిన ఓ బాలిక కిడ్నాప్ అయినట్లు కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కట్టా శారదా సతీష్ కథనం ప్రకారం.. బూరుగుపూడి గ్రామానికి చెందిన బాలికను అమలాపురానికి చెందిన సతీష్ కిడ్నాప్ చేసినట్లు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

- 14 రోజుల్లో 1.60 కోట్ల కుటుంబాల సర్వే
- కోరుకొండలో ప్రారంభించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: సంక్షేమ పథకాలను వివరిస్తూ, మరోమారు ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతూ 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం ఈ కార్యక్రమాన్ని కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాలులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ఆయా కుటుంబాలను కలిసి సర్వే చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ వెళ్లి అందరినీ కలుస్తామన్నారు. 14 రోజుల్లో 1.60 కోట్ల కుటుంబాలను కలవనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే రాజానగరం నియోజకవర్గంలోని 78 సచివాలయాలకు సంబంధించి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా 1,500 క్లస్టర్లలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా సర్వే చేస్తారన్నారు. అనంతరం మండల స్థాయి సచివాలయ కన్వీనర్లను ఆయన ప్రకటించారు. కోరుకొండ మండలానికి కన్వీనర్‌గా కందికట్ల జయకర్, రాజానగరం మండలానికి అడపా జగదీష్, సీతానగరం మండలానికి చేకూరి నానిలను వేదికపైకి పిలిచి అందరికీ పరిచయం చేశారు. జగనన్న సచివాలయ కమిటీలకు కిట్లు అందిస్తున్నామన్నారు. ఇందులో డోర్ స్టిక్కర్లు, మొబైల్ స్టిక్కర్లు, ప్రజా మద్దతు పుస్తకాలు ఉంటాయన్నారు. ఇందులో ఐదు ప్రశ్నలుంటాయని వివరించారు. జగనన్న పాలనలో మంచి జరిగిందా.. లేదా.., గత ప్రభుత్వం కంటే పింఛను, అమ్మ ఒడి, ఆసరా, చేయూత తదితర సంక్షేమ పథకాలు నేరుగా అందించడం బాగుందా.. వీటిని మళ్లీ అమలు చేయడానికి జగనన్నకు మద్దతు ఇస్తారా అనే ప్రశ్నలు ఉంటాయన్నారు. ఈ సర్వే ద్వారా పారదర్శకమైన సమాధానాలను రాబడతామన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను మే నెల 20న సమావేశం నిర్వహించి వెల్లడిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు వట్టికూటి రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కడియాల పాపారావు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: మండల పరిధిలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దాసరి రమేష్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి ప్రారంభించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, మడి గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: వైఎస్సార్‌సీపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి మండలంలోని గ్రామ గ్రామాన విశేష స్పందన లభించింది. మండలంలోని రామవరంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉండగా ప్రజల ముందుకు వెళ్లి తమ ప్రభుత్వ పనితీరును అడగగలిగే దమ్ము, ధైర్యం వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టిన ఒక్కరోజులోనే గ్రామంలోని మొత్తం 2,156 కుటుంబాలను సందర్శించి సర్వే పూర్తి చేసి ప్రభుత్వంపై ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకున్నామని చెప్పారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, సర్పంచ్ సత్తి వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కొమరిపాలెం గ్రామంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, బిక్కవోలు ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

పెదపూడి: ప్రతి కుటుంబం అన్ని విధాల అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని పెదపూడి సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్ అన్నారు. పెదపూడిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు.

సీతానగరం: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేశారు. ముగ్గళ్లలో ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ పనితీరుపై అడిగి నమోదు చేసుకున్నారు. అనంతరం ఇళ్ల వద్ద మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అంటించారు.



కొంకుదురులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా మహిళా సంఘం చైర్‌పర్సన్ పద్మావతి



ముగ్గళ్లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న



రామవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సింగంపల్లిలో సీఎం స్టిక్కర్‌ను గోడకు అతికిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: రంగంపేట మండలం సింగంపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని అనపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి ఇంటింటికీ వెళ్లి గత 46 నెలల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను వివరించారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మీకు మీ కుటుంబానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచి జరిగిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు వ్యత్యాసాన్ని తెలియజేసే కరపత్రాన్ని అందించారు. అంతకుముందు సచివాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని తెలియజేయడమే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి మార్కెట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శిలువ యాత్ర



అనపర్తిలో శిలువను మోస్తున్న క్రీస్తు వేషధారి



కోరుకొండలో శిలువ యాత్రను నిర్వహిస్తున్న ఆర్‌సీఎం చర్చి విశ్వాసులు

మధురపూడి: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని కోరుకొండలో శుక్రవారం శిలువ యాత్ర భక్తిశ్రద్ధలతో సాగింది. తొలుత ఈ యాత్ర కాపవరం ఎస్సీ బాలుర వసతి గృహం నుంచి ప్రారంభమైంది. క్రీస్తు వేషధారణలో యువకుడు శిలువను మోసుకుంటూ చెప్పులు లేకుండా నడవడం భక్తిని చాటింది. కోరుకొండ బస్టాండ్, పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చి వరకూ యాత్ర జరిగింది. అనంతరం చర్చిలో ఫాదర్ జోసఫ్ తంబీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఆధ్వర్యంలో 15 మంది యువకులు 40 రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉపదేశకులు బెల్లపు డేవిడ్, కొవ్వాడి జ్ఞానేష్, పాతగొలుసు అమ్మాజీ, తాడిమళ్ల నిర్మల పాల్గొన్నారు.

ఘనంగా కల్వరి శిలువ యాత్ర

అనపర్తి: సర్వమానవాళి పాప ప్రక్షాళన కోసం ప్రభువు శిలువపై తన రక్తాన్ని చిందించిన రోజును పురస్కరించుకుని క్రైస్తవులు గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కెనాల్ రోడ్డులోని ఆర్‌సీఎం అద్భుత బాలఏసు చర్చి ఆధ్వర్యంలో విశ్వాసులు శిలువ వేషధారి ప్రదర్శనతో గ్రామంలో కల్వరి శిలువ యాత్రను ఘనంగా నిర్వహించారు. యాత్రం పాతవూరు నుంచి కెనాల్‌రోడ్‌లోని ఆర్‌సీఎం చర్చి వరకూ సాగింది. చర్చి ఫాదర్ స్టీఫెన్ మాట్లాడుతూ క్రీస్తు శిలువలో ఉన్న సమయంలో పలికిన వచనాలు ప్రజలను సన్మార్గంలో నడిపిస్తున్నాయన్నారు. కల్వరి శిలువ యాత్రలో క్రీస్తు సంఘస్తులు లాజర్, జోకబ్, అనపర్తి, కొంకుదురు, రాయవరం గ్రామాలకు చెందిన విశ్వాసులు పాల్గొన్నారు.

పెదపూడి: పెదపూడిలో బేతేలు ప్రార్థన మందిరంలో పాస్టర్ బిషప్ చుక్కా శామ్యూల్ రాజు, దేవకుమారి దంపతులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ చుక్కా జాన్ రత్నం ఉపదేశించారు. మండలంలోని వివిధ చర్చిల్లో క్రీస్తు భక్తులు గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఏసుక్రీస్తుకు శిలువ వేశారని, 3 గంటలకు ఆయన ప్రాణం విడిచారని క్రైస్తవ బోధకులు భక్తులకు ఉపదేశించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు మరణంపై కీర్తనలు ఆలపించారు.

గోకవరం: మండల వ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. గోకవరం సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, కృష్ణునిపాలెంలోని ఈహెచ్‌హెచ్, సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామాల్లో క్రైస్తవులు శిలువతో ర్యాలీలు చేశారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందాం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- శహపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



శహపురంలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి



సింగంపల్లిలో సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రజలందరి సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శహపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యేకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పేదరికమే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలందరూ మళ్లీ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, ఏఎంసీ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు చందాళ్ల పార్వతి, సొసైటీ చైర్మన్ గాజంగి వెంకటరమణ, చందాళ్ల వెంకటరమణ, బుద్దాల శ్రీను, వనుం చిన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల పురోభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రంగంపేట: పల్లెల పురోభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సింగంపల్లి గ్రామంలో రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని, అనపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వరపుల సుబ్బారావుతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చారన్నారు. సింగంపల్లి జగనన్న కాలనీ వద్ద రూ.2.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజల దగ్గరికే వైద్య సేవలను తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి మార్కెట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సబ్బెళ్ళ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



బొల్లెద్దుపాలెంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక బీసీ, ఓసీ పేటల్లోని 200 కుటుంబాలను కలుసుకున్నారు. ఆయనకు మహిళలు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, సర్పంచ్ కె.వెంకట రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు అల్లి సింహాచలం, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దేగల బాబులు పాల్గొన్నారు.

అనంతరం వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా వరి కోత మెషీన్‌ను ప్రారంభించి గాదరాడ రైతులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందజేశారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వేసవిలో పశు సంరక్షణపై ముందు జాగ్రత్తలు
- వడదెబ్బ తగలకుండా రక్షణ చర్యలు తప్పనిసరి



బిక్కవోలు: వేసవిలో ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతోంది. సూరీడు భగ్గుమంటున్నాడు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉష్ణతాపం కారణంగా బయటకు రావాలంటేనే భయపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పాడి పశువులకు వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే అవి మృత్యువాత పడే అవకాశముంటుందని, అప్రమత్తతే శ్రీరామరక్ష అని పశువైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పాల దిగుబడిపైనా ప్రభావం

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో సుమారు 12 వేల ఆవులు, 35 వేల గేదెలు ఉన్నాయి. సాధారణంగా వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల పాడి పశువులు ఒత్తిడికి, అసౌకర్యానికి గురవుతాయి. దీంతో మేత తీసుకోవడం తగ్గిపోతుంది. తద్వారా పాల దిగుబడి, పాలలో వెన్న శాతం సైతం తగ్గిపోతాయని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. సరైన రక్షణ చర్యలు తీసుకోకపోతే పశువులు వడదెబ్బ తినే ప్రమాదం సైతం ఉందంటున్నారు. పశువులకు వడదెబ్బ తగిలితే అధిక శ్వాస, నాడి, గుండె వేగంగా కొట్టుకోవడం, చొంగ ఎక్కువగా కార్చడం కనిపిస్తాయి. చర్మంపై వెంట్రుకలు బిరుసుగా తయారవుతాయి. వడదెబ్బ తగిలినట్లు కనిపిస్తే పశువులను వెంటనే చల్లని ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీరంపై నీళ్లు చల్లి వెంటనే వైద్యులకు చూపించాలి. వడదెబ్బ తగలకుండా పశువుల సంరక్షణకు రోజువారీ యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు.

చల్లగా ఉంచేందుకు చర్యలు

- పశువుల కొట్టం లేదా షెడ్డులోకి గాలి వెలుతురు బాగా ప్రవేశించేలా చూసుకోవాలి. షెడ్డుకు చుట్టూ నీడనిచ్చే చెట్లు ఉంటే మరీ మంచిది.
- షీట్లు వేసిన షెడ్డుపై 8 సెంటీమీటర్ల నుంచి 10 సెంటీమీటర్ల మందంతో ఎండు గడ్డిని పరిచి రోజుకు రెండు మూడుసార్లు నీటితో తడపాలి.
- షెడ్డుకు ఇరువైపులా గోనె సంచులను కట్టి నీటితో తడపడం ద్వారా షెడ్డు లోపల ఉష్ణోగ్రతతో పాటు వేడి గాలుల తీవ్రతను తగ్గించొచ్చు. వీలైతే నీటి స్ప్రింక్లర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేసుకుంటే మంచిది.
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో పశువులను బయటకు తీసుకెళ్లకూడదు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకెళ్లాలి.
- పశువులకు పోషక విలువలు ఎక్కువగా ఉన్న మేతను అందించాలి. ఉదయం పచ్చి మేతను, సాయంత్రం ఎండు మేతను అందించాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



వేసవిలో పాడి రైతులు పశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలి. వడదెబ్బ తగలకుండా పశువుల షెడ్డు వద్ద వాతావరణం చల్లగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలి. పచ్చ గడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. దీనివల్ల పాల దిగుబడి పెరిగే అవకాశముంటుంది. – డాక్టర్ శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖ ఏడీ, అనపర్తి

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

బిక్కవోలు: లారీ ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయని బిక్కవోలు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కృష్ణ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం బిక్కవోలుకు చెందిన కె.రాంబాబు ద్విచక్ర వాహనంపై మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. మెయిన్‌రోడ్డు వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో రాంబాబుకు గాయాలయ్యాయి. అతడిని అనపర్తి సీహెచ్‌సీ తరలించి చికిత్స అందిస్తున్నారు.

పోలవరంపై కేంద్రం నమ్మక ద్రోహం

ప్రకాశంనగర్: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం బాధ్యత కేంద్రానిదేనని, ఈ జాతీయ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా నమ్మక ద్రోహం చేస్తుందని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ విమర్శించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ, సీపీఎం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.